క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దారవీడు: మండలంలోని బద్వీడుచెర్లోపల్లె సచివాలయం పరిధి బద్వీడులో మంగళవారం సాయంత్రం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.నాసర్‌రెడ్డి సోమవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హాజరవుతారని చెప్పారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీ, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు రావాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

బేస్తవారిపేట: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.రంజాబీ సోమవారం తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులకు జూలై 7వ తేదీలోపు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. మండలంలోని పందిళ్లపల్లె ఎస్సీ, ఎంపీ చెరువు–2 కార్యకర్తల పోస్టులు, ఆయాల పోస్టులకు సంబంధించి పందిళ్లపల్లె–1 ఓసీ, బేస్తవారిపేట–5 ఓసీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సమీపంలో సచివాలయాలను సంప్రదించాలని కోరారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ


లారీని క్రేన్‌తో తొలగిస్తున్న స్థానికులు

కంభం: ఇసుక లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటన సోమవారం తెల్లవారు జామున జరిగింది. వివరాలు.. ఇసుక లోడు కంభం నుంచి మార్కాపురం వైపు వెళ్తున్న లారీ స్థానిక వైజంక్షన్ వద్ద ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో ముందు బాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. పోలీసులు క్రేన్ సాయంతో డివైడర్‌పైకి ఎక్కిన లారీని తొలగించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

దర్శి: ఆటో రిక్షా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శామంతపూడి రూట్ ఆటో రిక్షా కార్మిక సంఘ అధ్యక్షుడు గండి వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం నిర్వహించిన ఆటో వర్కర్స్ సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడారు. తమకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు కేవీ రెడ్డి, యాకోబ్, కొండయ్య, జాలయ్య, కోటేశ్వరరావు, కరుణానిధి తదితరులు పాల్గొన్నారు.

అదనపు చార్జీలు రద్దు చేయండి

దర్శి: అదనపు కరెంటు చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన విరమించాలని కోరుతూ తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు సీపీఎం దర్శి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు సోమవారం వినతిపత్రం అందజేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సాహూ మహరాజ్ జయంతి

మార్కాపురం టౌన్: పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సాయంత్రం బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాహూ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి రాష్ట్ర అధ్యక్షుడు పీసీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ సంస్కర్తగా సాహూ మహరాజ్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రజనీకుమార్, రంగనాయకులు, శ్రీనివాసులు, శ్రీరాములు, చంద్రశేఖరయ్య, డి బాలయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ పటిష్టతకు కృషి చేయండి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని సన్మానిస్తున్న హెచ్‌ఎంలు, ఎంఈఓలు

మార్కాపురం: విద్యా వ్యవస్థ పటిష్టతకు హెచ్‌ఎంలు, ఎంఈఓలు కృషి చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. ఇటీవలే హెచ్‌ఎంలుగా, ఎంఈఓలుగా బాధ్యతలు స్వీకరించిన ఎం.సుధాకర్, ఎస్‌వీహెచ్ సుబ్రహ్మణ్యం, మండ్లా రామాంజనేయులు తదితరులు సోమవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి, కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. డ్రాపౌట్స్ లేకుండా చూడాలని టీచర్లకు సూచించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రారంభించిన ఇగ్నైట్ యంగ్ మైండ్స్ కార్యక్రమానికి అందరూ సహకరించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకునిరావాలని చెప్పారు.

అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలి

కొనకనమిట్ల: పాఠశాల విద్యార్థులు చదువులో రాణించేలా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని ఎంఈఓ–2 బి.నరసింహరావు సూచించారు. సోమవారం గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. నాడు–నేడు పనులను, పాఠశాల తరగతి గదులను, మధ్యాహ్న భోజనం మెనూను పరిశీలించారు. ప్రిన్సిపాల్ సురేఖతోపాటు సీఆర్పీలు ఉన్నారు.

పాఠశాల బలోపేతానికి కృషి చేయాలి

రాచర్ల: ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి తల్లిదండ్రులు కృషి చేయాలని ఎంఈవో–2 వారణాసి గిరిధర్ శర్మ అన్నారు. మండల కేంద్రం రాచర్ల ఎంపీయూపీ స్కూల్, మోడల్ స్కూల్లో సోమవారం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కల్పించడమే కాకుండా రుచికరమైన భోజనం ఏర్పాటు చేస్తోందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని తెలిపారు. విద్యార్థులకు అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న ఆణిముత్యాలు, ఇంగ్లిష్ మీడియం గురించి తల్లిదండ్రులకు వివరించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులతో పాస్ కావడం జరిగిందని తల్లిదండ్రులకు తెలిపారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్‌రావు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లోనే విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందించనున్నట్లు ఎంఈవో–2 ఇందిర అన్నారు. సోమవారం మండలంలోని కొమరోలు, యండ్రపల్లి గ్రామాల్లో సార్డ్స్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విద్య ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో–2 మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ప్రత్యేకమైన శ్రద్ధ చూపుతూ అధిక ప్రాధాన్యం ఇస్తుందని, అమ్మఒడి, జగనన్న విద్యాకానుక గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. సీఆర్‌పీ హనుమానాయక్, సార్డ్స్ సంస్థ ప్రతినిధులు మరియబాబు, భాగ్యలక్ష్మి, ధర్మనాయక్, గురవయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట

అర్ధవీడు (కంభం): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని ఎంపీపీ వెంకట్రావు, జెడ్పీటీసీ సభ్యురాలు చెన్ను విజయ అన్నారు. స్థానిక బాలయోగి గురుకుల పాఠశాలలో 10వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యం పథకం కింద సోమవారం విద్యార్థులకు సర్టిఫికెట్, మెడల్, నగదు బహుమతులు, జగనన్న విద్యాకానుకలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొని విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ బలరాంరెడ్డి, సర్పంచ్ వసంతమ్మ పాల్గొన్నారు.


కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ


జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

వృద్ధుల కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ సేథు మాధవన్

- బ్రోచర్‌ను ఆవిష్కరించిన సబ్ కలెక్టర్

మార్కాపురం: వృద్ధుల సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 14567ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు ఎల్డర్ లైన్ స్వచ్ఛంద సంస్థ జిల్లా ప్రతినిధి పాటిబండ్ల జాన్‌బాబు తెలిపారు. సోమవారం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ సేథుమాధవన్ చేతులమీదుగా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. పిల్లలు పట్టించుకోని తల్లిదండ్రులు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళ నాయకురాలు రోజ్‌లిడియా తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డబుల్ లైన్ పనులకు సహకరించాలి


కొండపోరంబోకు స్థలంలో నివాసం ఉంటున్న మహిళతో మాట్లాడుతున్న తహసీల్దార్

గిద్దలూరు రూరల్: గుంటూరు–నంద్యాల మధ్య రైల్వే డబుల్ లైన్ పనులకు సహకరించి ఆక్రమణలో ఉన్న గృహాలను ఖాళీ చేయాలని తహసీల్దార్ కె.విజయకుమారి కోరారు. గిద్దలూరు రెవెన్యూ పరిధిలోని పాములపల్లె రైల్వే గేటు, రాచర్లరైల్వే గేటు మధ్య హిల్ 10 కొండ పోరంబోకు స్థలంలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న వారి వద్దకు సోమవారం తహసీల్దార్ వెళ్లి వారితో గృహాలను త్వరగా ఖాళీ చేయాలని కోరారు. గృహాలను ఖాళీ చేస్తే ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని సూచించారు. హిల్ 10 కొండ పోరంబోకు స్థలంలో నివాసం ఉంటున్న 22 గృహాల యజమానులు తక్షణమే వారి గృహాలను ఖాళీ చేస్తే తక్షణమే ఆ స్థలాన్ని రైల్వేశాఖ వారికి అప్పగించాల్సి ఉంటుందన్నారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ములాయం విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీసీ నాయకులు

పొదిలి: ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం ములాయంసింగ్ యాదవ్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని బీసీ సంఘాల నాయకులు కోరారు. సోమవారం పట్టణంలో కార్యక్రమ ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాశం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జూలై 9వ తేదీన గుంటూరు జిల్లా కాజ వద్ద విగ్రహావిష్కరణ, అనంతరం నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ప్రజా చైతన్య వేదికలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ నాయకులు ఎం.బాబూరావు, మందగిరి వెంకటేష్ యాదవ్, ఎస్.చంద్రశేఖర్, కనకం వెంకటరావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు శివరాత్రి శ్రీనివాస్, కోనంకి సంజీవరావు, షేక్.మీరావలి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు


విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు

కొనకనమిట్ల: రైతులకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అక్కిదాసరి ఏడుకొండలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చినారికట్ల రైతు భరోసా కేంద్రంలో జాతీయ ఆహార భద్రత మిషన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు కంది విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విత్తనాలతోపాటు రైతులకు సరిపడా ఎరువులు ఆర్బీకేల్లో సిద్ధంగా ఉంచాలని ఏఓకు సూచించారు. వ్యవసాయాధికారి ప్రసన్న రంగలక్ష్మి మాట్లాడుతూ.. గ్రామాల్లో భూసార పరీక్షలకు శాంపిళ్లు సేకరించినట్లు తెలిపారు. కందులు, జీలుగలు, పెసర, పిల్లి పెసర, జనుములు సరఫరా చేస్తున్నామని, కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో పేరు నమోదు చేసుకుంటే 50 శాతం రాయితీపై అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, సర్పంచ్ అనురాధ, వెలుగొండయ్య, ఎంపీటీసీ ఉడుముల ధనలక్ష్మి, బంగారురెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ దాతృత్వం అలవరచుకోవాలి


బాలికలకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

దర్శి: ప్రతిఒక్కరూ దాతృత్వం అలవరచుకుని పేదలకు సహాయ సహకారాలు అందించాలని సీఐ జే రామకోటయ్య కోరారు. స్థానిక ఎస్వీఆర్ మార్కెటింగ్ కాంప్లెక్స్‌లో పాతకమూరు, తూర్పు వెంకటాపురం, కొత్తపల్లి, దర్శి ప్రభుత్వ బాలికల హైస్కూళ్లలో చదివే పేద బాలికలకు రూ.2.60 లక్షల విలువైన 40 సైకిళ్లను సోమవారం రోటరీ క్లబ్ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి అధ్యక్షతన అందజేశారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్లు అందించిన రెడ్డిమాసు శ్రీను, సోము దుర్గారెడ్డిని రోటరీ క్లబ్ సభ్యులు, సీఐ అభినందించారు. కార్యక్రమంలో ట్రెజరర్ కర్ణా రమణారెడ్డి, ప్రముఖ హోమియో వైద్యుడు ఎస్‌ఎం బాషా, చెవిరెడ్డి రాజారెడ్డి, ఎదురు నారాయణరెడ్డి, అలవల అంజిరెడ్డి, పానుగంటి కోటేశ్వరరావు, వెన్నపూస పేరిరెడ్డి, మేడగం రవిచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి, ఏ నారాయణరెడ్డి, బీ కోటిరెడ్డి, శివకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి


పొట్లపాడులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్డీ ప్రసాదరావు

కురిచేడు: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు నిర్వహిస్తున్న సర్వేను ఈవోఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు సోమవారం మండలంలోని పొట్లపాడు గ్రామంలో పరిశీలించారు. జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందని తెలిపారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం డిజిటల్ అసిస్టెంట్లకు టోకెన్ జనరేషన్, కన్సాలిడేటెడ్ రిపోర్టులు పంపించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసన్న వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న భక్తులు, కమిటీ సభ్యులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగిసి 16 రోజులైన సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దరూరి అరుణ్‌కుమార్ ఆచార్యులు మల్లెపూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి సహస్ర నామార్చన, సుప్రభాత సేవ, ఊంజల్‌సేవ, ఏకాంతసేవ, ఆండాళ్ గోష్ఠి నిర్వహించారు. ఉత్సవాలను విజయవంతం చేసిన చైర్మన్ రావిపాటిరామారావు, ఉపాధ్యక్షుడు నిట్టూరి వెంకట రమేష్‌ను కమిటీ సభ్యులు సన్మానించారు.

గ్రామాల్లో సామాజిక తనిఖీలు ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఆర్‌పీ సుమన్

దొనకొండ: మండలంలోని 18 పంచాయతీల్లోని 40 హ్యాబిటేషన్లలో ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీలను సోమవారం ప్రారంభించారు. 10 మంది వీఎస్‌ఏలు, ఏడుగురు డీఆర్‌పీలు తనిఖీలు చేపట్టారు. 01–04–2022 నుంచి 31–03–2023 వరకు మండలంలో సుమారు రూ.10 కోట్ల విలువైన ఉపాధి పనులు చేశారు. ఎస్‌ఆర్‌పీ పి.సుమన్ ఆధ్వర్యంలో పనులకు కొలతలు వేసి అంచనాలు రికార్డు చేస్తున్నారు. జూలై 2వ తేదీ ఉపాధి కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో టి.దేవయ్య తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు సమస్యలేమైనా ఉంటే ప్రజావేదికలో అధికారుల వద్ద వెల్లడించాలని ఏపీవో తెలిపారు.

పేదల ఇళ్లలో సంతోషమే లక్ష్యం

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- దరిమడుగులో గడప గడపకు మన ప్రభుత్వం
- గజమాలలు, హారతులతో ఎమ్మెల్యే కేపీకి ఘన స్వాగతం


గజమాలతో ఎమ్మెల్యే కేపీ, ఆయన సోదరుడిని సత్కరిస్తున్న నాయకులు

మార్కాపురం: 'మీ అభిమానాన్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంటా, పేదల ఇళ్లలో సంతోషం నింపడమే సీఎం జగనన్న లక్ష్యమ'ని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం దరిమడుగు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో అమ్మ ఒడి పథకాన్ని ఇస్తున్నారన్నారు. ఉన్నత చదువులు చదివేందుకు జగనన్న విద్యదీవెన, వసతి దీవెన పథకాలు అమలు చేస్తున్నారన్నారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు పాఠశాలల అభివృద్ధిపై ఏ ముఖ్యమంత్రీ దృష్టి సారించలేదన్నారు. సీఎం జగన్ మాత్రమే నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా వేల కోట్ల రూపాయలు కేటాయించి రాష్ట్రంలో అన్ని పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నారని కొనియాడారు. వ్యవసాయం భారంగా కాకూడదని భావించి ఏటా రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లో రైతు భరోసా ఇస్తున్నారని, ఆర్బీకేలు ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తున్నారన్నారు. ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి నెలా 1వ తేదీనే అవ్వాతాతలకు పింఛను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. తొలుత ఎమ్మెల్యే కేపీని గ్రామ నాయకులు గజమాలతో సన్మానించారు. పూలు చల్లి, హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు కుందురు కృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీపీ అరుణ చెంచిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జవ్వాజి రంగారెడ్డి, పార్టీ నాయకులు బట్టగిరి తిరుపతిరెడ్డి, వెంకటరెడ్డి, ఎంపీటీసీ పేతురు, కోలగట్ల శివారెడ్డి, వై.రంగయ్య, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రమేష్, కౌన్సిలర్ బుశెట్టి నాగేశ్వరరావు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

- అవగాహన ర్యాలీల్లో ఎస్‌ఈబీ, పోలీస్ అధికారులు

మార్కాపురం టౌన్: గంజాయి, నాటుసారా, హెరాయిన్ తదితర మత్తు పదార్థాలకు యువత, ప్రజలు దూరంగా ఉండాలని మార్కాపురం డివిజన్ ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్లు రాగమయి, వెంకటరమణ, వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం అంతర్జాతీయ యాంటీ డ్రగ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. డ్రగ్స్ వాడకంతో విలువైన జీవితం నాశనమవుతుందని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై దృష్టి పెట్టాలని సూచించారు. సెబ్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు, కోర్టు సెంటరు మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. పట్టణ ఎస్సై శశికుమార్, సెబ్ ఎస్సై పద్మజ, వివిధ కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

మార్కాపురం: అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం పట్టణ శివారులోని ఏకలవ్య కాలనీలో ఉన్న ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కరీముల్లా, పట్టణ ఎస్సై శశి కుమార్ మాట్లాడుతూ.. బాలల చట్టాలు, డ్రగ్స్ వాడకంతో సంభవించే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ చౌదరి, అనీల్‌రాజ్, ఎస్‌కే బాషా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రమణయ్య


మార్కాపురం : ర్యాలీలో ఎస్‌ఈబీ, పోలీస్ అధికారులు


పొదిలి: మాట్లాడుతున్న సీఐ ఖాజామొహిద్దీన్

పొదిలి: ఎస్‌ఈబీ అధికారులు ఆధ్వర్యంలో పొదిలిలో మాదకద్రవ్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఈబీ సీఐ ఖాజామొహిద్దీన్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వాడకంతో యువత భవిష్యత్ నిర్వీర్యం అవుతుందని చెప్పారు. ఈ మేరకు సెబ్ స్టేషన్ నుంచి పెద్ద బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ సుధమారుతి, ఎస్సై మల్లికార్జున, ఎస్‌ఈబీ ఎస్సై రాజేంద్రప్రసాద్, సూపర్‌వైజర్ సుభాషిణి, ఏఎస్సై వెంకటేశ్వరరెడ్డి, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కంభం: మాదక ద్రవ్యాలకు బానిసగా మారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని స్థానిక సీఎం రాజేష్ విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని హ్యాండ్స్ ఆఫ్ కంపాషిన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వాసవీ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలతో కలిగే దుష్ప్రయోజనాలు, నష్టాలపై ప్రజలు, విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. నిషేధిత వస్తువులు, మాదక ద్రవ్యాలు విక్రయించడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారి సమాచారాన్ని పోలీసులకు అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు, వాసవీ విద్యా సంస్థల కరస్పాండెంట్ గోళ్ల సుబ్బరత్నం, ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్‌బాబు, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్, కళాశాల ప్రిన్సిపాల్ రాము, ప్రసాద్, నాగేశ్వరి, విజయకుమారి, హసీన, షబాన, ప్రసన్న, దీపకా పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి ర్యాలీకి హాజరైన సీఐ, ఎస్‌ఐ

గిద్దలూరు రూరల్: మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవేందర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దినోత్సవం సందర్భంగా సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు పట్టణంలోని ఆదర్శ బీఈడీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ విద్యను అభ్యసించాలన్నారు.

దర్శి: మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సీనియర్ సివిల్ జడ్జి జీఎల్‌పీ ప్రసాద్ సూచించారు. సోమవారం జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం, అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయవ్యవస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ప్రసాద్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి, హెరాయిన్, సారా వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే అనారోగ్యం పాలు కావడమే కాకుండా ఆరోగ్య పరంగా నష్టపోతారన్నారు. అక్రమంగా మత్తు పదార్థాలు తరలించడం నేరమని చెప్పారు.